ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన తప్పనిసరి

చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జడ్జి రమేశ్

పటాన్‌చెరు, జూలై 3: విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ జడ్జి రమేశ్ అన్నారు. బుధవారం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో జిల్లా శిశు సంక్షేమ శాఖ, మహిళా సాధికారత కేంద్రం బేటీ బచావో– బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన రమేశ్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ చట్టాలను గౌరవించాలన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. కొత్తగా వచ్చిన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యా అధినియం చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజేశ్, ప్రధానోపాధ్యాయులు జయశ్రీ, ముంతాజ్, విశాల, షీ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

న్యాల్‌కల్, జూలై 3: రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నదని మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు అంజమ్మ అన్నారు. బుధవారం మండలంలోని ఆత్మూర్ గ్రామంలో రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన పంచాయతీ భవనాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదేండ్లుగా మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాల కింద మంజూరైన నిధులతో గ్రామాల అభివృద్ధికి కృషి చేశామన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గౌసొద్దీన్, మండల అభివృద్ధి అధికారి సురేశ్, నాయకులు శివాజీపాటిల్, సంగ్రాంపాటిల్, రఫీయొద్దీన్ పాల్గొన్నారు.

వివేకవంతులుగా తీర్చిదిద్దాలి

నాగల్‌గిద్ద, జూలై 3: అంగన్‌వాడీ కేంద్రాల్లోని ఐదేండ్ల లోపు వయస్సు గల పిల్లలను వివేకవంతులుగా తీర్చిదిద్దడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని సీడీసీవో సుజాత అన్నారు. బుధవారం మండలంలోని కరస్‌గుత్తి ప్రభుత్వ దవాఖానలో నూతన జాతీయ విద్యావిధానంలో భాగంగా రివైజ్డ్ ప్రీ స్కూల్ కరికులం శిక్షణ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మంజూల, ప్రశాంతి పాల్గొన్నారు.

మాల్గి హత్య ఘటనలో ముగ్గురు అరెస్ట్

న్యాల్‌కల్, జూలై 3: మండలంలోని మల్గి గ్రామంలో ఆస్తి తగాదాలో అన్నను హత్య చేసిన తమ్ముడి కుటుంబ సభ్యులను ఆరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు జహీరాబాద్ రూరల్ సీఐ నయీముద్దీన్ తెలిపారు. బుధవారం మండలంలోని హద్నూర్‌లో విలేకరులతో మాట్లాడారు. మండలంలోని మల్గి గ్రామంలో మంగళవారం ఆస్తి తగాదాలో తెలుగు బాబును ఆతని తమ్ముడు తెలుగు వైద్యనాథ్, ఆయన భార్య కళావతి, కుమారుడు రవి కట్టెలతో దాడి చేసి హత్య చేసిన విషయం తెలిసిందే.. హత్యకు పాల్పడి పరారీలో ఉన్న నిందితులను బుధవారం మండలంలోని కల్‌బేమల్ గ్రామంలోని బంధువుల ఇంటి వద్ద అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వారిని జహీరాబాద్ కోర్టులో హాజరుపర్చామని పేర్కొన్నారు. హద్నూర్ ఎస్ఐ రామానాయుడు ఉన్నారు.

రేపు అథ్లెటిక్స్ ఎంపికలు

సంగారెడ్డి కలెక్టరేట్, జూలై 3: జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలను ఈ నెల 5న స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మైదానంలో నిర్వహించనున్నట్టు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎండీ జాబిద్ అలీ బుధవారం ప్రకటనలో తెలిపారు. 8, 10, 12 ఏళ్ల బాల బాలికలకు ఎంపికలు ఉంటాయన్నారు. ఇందులో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 7న గచ్చిబౌలీలోని గోపిచంద్ అకాడమీలో జరిగే రాష్ట్ర స్థాయి కిడ్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పాల్గొంటారని వివరించారు. ఎంపిక కోసం హాజరయ్యే అభ్యర్థులు ఈ నెల 5న ఉదయం 9 గంటలకు జనన ధ్రువీకరణ పత్రంతో హాజరుకావాలని కోరారు. వివరాలకు జావేద్ అలీ 9849355586, శశిరేఖ, ఆర్గనైజింగ్ సెక్రెటరీ 9492728034 నంబర్లపై సంప్రదించవచ్చన్నారు.

రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ

రాయికోడ్/న్యాల్‌కల్/ఝరాసంగం/కోహీర్, జూలై 3: రైతు భరోసాపై జిల్లా వ్యాప్తంగా రైతుల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నారు. బుధవారం రాయికోడ్ మండలంలోని సింగితం రైతు వేదికలో ఇందూర్ పీఏసీఎస్ చైర్మన్ హనుమంతు ఆధ్వర్యంలో, న్యాల్‌కల్ రైతు వేదికలో జిల్లా సహకార సంఘం ఆధికారి ప్రసాద్ ఆధ్వర్యంలో, ఝరాసంగం మండలం ఏడాకులపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆవరణలో డీసీఎంఎస్ చైర్మన్ అధ్యక్షతన, కోహీర్ మండలంలోని పీచెర్యాగడి, బిలాల్‌పూర్ ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాల ఆధ్వర్యంలో రైతు భరోసాపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు.

రైతుభరోసా ఇచ్చి ఆదుకోవాలి

జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

జహీరాబాద్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

కోహీర్, జూలై 3: ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం అందించి ఆదుకోవాలని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అన్నారు. బుధవారం జహీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు సాగుకు ముందే పెట్టుబడి సాయం ఇచ్చేవారని గుర్తు చేశారు. కానీ కాంగ్రెసోళ్లు రైతులను పట్టించుకోవడం లేదన్నారు. కౌలు రైతులకు కూడా రూ. 12వేలు ఇస్తామని హామీనిచ్చారన్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఎరువులు, విత్తనాలు సకాలంలో అందించిందన్నారు. గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరా కూడా సక్రమంగా జరగడం లేదని ఆరోపించారు. సమావేశంలో డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుండప్ప, తట్టు నారాయణ, నర్సింహులు, మోహియొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీలతో జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్ రెడ్డి

ఏమిచ్చినా పుల్కల్ రుణం తీర్చుకోలేం

జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి

పుల్కల్, జూలై 3: ఏమిచ్చినా పుల్కల్ రుణం తీర్చుకోలేనని జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చైతన్యావిజయ్‌భాస్కర్ రెడ్డి అధ్యక్ష తన నిర్వహించిన ఎంపీటీసీల వీడ్కోలు సమావేశానికి హాజరై మాట్లాడారు. పుల్కల్ మండలం నుంచి జడ్పీటీసీగా ఎన్నికై, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా మండలానికి సేవ చేసే భాగ్యం కలిగినందుకు గర్వపడుతున్నానన్నారు. ఎంపీటీసీ సభ్యులు జడ్పీచైర్‌పర్సన్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం ఎంపీటీసీల దంపతులను జడ్పీ చైర్‌పర్సన్ శాలువా, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీఓ ఆనంద్ మేరి, వైస్ ఎంపీపీ గాజుల వీరేందర్, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ యాదగిరి రెడ్డి, రైతు బంధు సమితి మండల మాజీ అధ్యక్షుడు నర్సింహా రెడ్డి, నాయకులు విజయ్ భాస్కర్‌రెడ్డి, కనకా రెడ్డి, మహేశ్‌బాబు, సిద్దన్న పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కులు అందించాలి

మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ షాకీర్‌అలీ

కోహీర్, జూలై 3: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను వెంటనే అందించాలని వైస్ ఎంపీపీ షాకీర్‌అలీ అధికారులను కోరారు. బుధవారం కోహీర్ పట్టణంలోని ఎంపీపీ మాధవి అధ్యక్షతన మండల సాధారణ సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెక్కులు ఇవ్వకపోవడంతో లబ్ధిదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 24 గంటలపాటు విద్యుత్ సరఫరా చేయాలని ప్రభుత్వం చెబితే అధికారుల పనితీరు మాత్రం సక్రమంగా లేదని, గంటల తరబడి కట్ చేస్తున్నారన్నారు. ధ్వంసమైన తహసీల్ కార్యాలయ రోడ్డు, కోహీర్–బిలాల్‌పూర్ ప్రధాన రోడ్డును వెంటనే నిర్మించాలన్నారు. అనంతరం ఎంపీటీసీలను సన్మానించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి జంగారెడ్డి, జడ్పీటీసీ రాందాస్, ఎంపీడీవో భారతి, ఎంపీవో రఘు, ఎంపీటీసీలు మల్లన్నపాటిల్, శ్రీనివాస్, లావణ్య, రత్నయ్య, బక్కారెడ్డి, హీనాకౌసర్ పాల్గొన్నారు.

మాదారంలో క్రషర్లను మూసేయాలి

తహసీల్దార్ భిక్షపతికి వినతిపత్రం ఇస్తున్న మాదారం గ్రామస్తులు

జిన్నారం, జూలై 3: మాదారం పంచాయతీ పరిధిలోని కంకర క్రషర్లను శాశ్వతంగా మూసేయాలని గ్రామస్తులు తహసీల్దార్‌ను కోరారు. ఈ మేరకు బుధవారం గ్రామ నాయకుడు రాజుగౌడ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు పలువురు తహసీల్దార్ భిక్షపతిని కలిసి వినతి పత్రం అందజేశారు. సర్వేనంబర్ 210లోని కంకర క్రషర్లు నిబంధనలు పాటించడం లేదని, అనుమతులకు మించి క్వారీలో తవ్వకాలు జరుపుతున్నారన్నారు. లీజు గడువు ముగిసినా రెండు క్వారీల్లో తవ్వకాలు ఆగడం లేదని ఆరోపించారు. ఉన్న కంకర క్రషర్లను మూసేయాలని, కొత్త వాటికి అనుమతులు ఇవ్వొద్దని కోరారు. క్రషర్లతో మాదారం, మంత్రికుంట గ్రామాల్లోని ఇండ్లు బీటలు వారుతున్నాయని, చెరువు తూములు కూలిపోతున్నాయని వాపోయారు. సమీపంలో ఉన్న చేలల్లో, రోడ్లపై రాళ్లు పడుతున్నాయన్నారు. ఆది ఎల్లయ్య, సుదర్శన్, శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఖాజీపల్లి నుంచి సికింద్రాబాద్ బస్సు ప్రారంభం

బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న మాజీ జడ్పీ చైర్మన్ రామకృష్ణ

జిన్నారం, జూలై 3: ఖాజీపల్లి నుంచి నిజాంపేట మీదుగా సికింద్రాబాద్ వరకు బస్సు సర్వీసు బుధవారం ప్రారంభమైంది. ఖాజీపల్లిలో బస్సు సర్వీస్‌ను మాజీ జడ్పీ చైర్మన్ రామకృష్ణ గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు సౌకర్యం సరిగ్గా లేక నాలుగేండ్ల క్రితం నిలిచిపోయిన బస్సు సర్వీసు గ్రామానికి మళ్లీ మొదలయ్యాయని సంతోషం వ్యక్తం చేశారు. నిజాంపేట మీదుగా సికింద్రాబాద్ వరకు వెళ్లే వారికి చాలా ఉపయోగపడుతుందన్నారు. బస్సు సర్వీసును పునరుద్ధరించిన గ్రామ జేఏసీ నాయకులకు ఆయన అభినందనలు తెలిపారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం రెండు ట్రిప్పులతో పాటు గంటకో ట్రిప్పు బస్సు తిరగనుంది. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది, పర్యావరణవేత్త దండే రమాకాంత్, ఆకుల నవీన్ కుమార్, శాగ అశోక్, సురేశ్, మహేశ్, కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

భ్యాతోల్‌లో అభివృద్ధి పనులకు భూమిపూజ

భ్యాతోల్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న జడ్పీటీసీ కొండల్‌రెడ్డి

కంది, జూలై 3: మండలంలోని భ్యాతోల్‌లో రూ.51 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులను బుధవారం జడ్పీటీసీ కొండల్‌రెడ్డి ప్రారంభించారు. భ్యాతోల్, భ్యాతోల్ తండాలో నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలతోపాటు ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా యన మాట్లాడుతూ గత ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీలకు నిధులు కేటాయించి అభివృద్ధికి బాటలు వేయాలని కోరారు. ఐదేళ్ల పదవీ కాలంలో జడ్పీటీసీగా మండలంలో ఎన్నో అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. పదవిలో లేకపోయినా అందరికి అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ పనులు పూర్తి చేయాలి

మల్లన్న బస్తీవాసులతో మాట్లాడుతున్న మాజీ జడ్పీటీసీ బాల్ రెడ్డి

బొల్లారం, జూలై 3: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో నిర్వారామంగా కొనసాగుతున్న మిషన్ భగీరథ పనులను బీఆర్ఎస్ నాయకుడు, మాజీ జడ్పీటీసీ కోలన్ బాల్ రెడ్డి పరిశీలించారు. బుధవారం పోచమ్మ బస్తీ, మల్లన్న బస్తీల్లో పర్యటించి పనులను పరిశీలించారు. పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు తాగునీటిని అందించాలని అధికారులకు సూచించారు. మున్సిపాలిటీలోని ప్రతి గడపకూ మిషన్ భగీరథ జలాలను అందించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. మౌలిక వసతుల కల్పనకు అధికారులు సహకరించి మున్సిపాలిటీ అభివృద్ధికి తోడ్పాటునందించాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, బస్తీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులకు సన్మానం

ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లను సన్మానించిన జడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్

జిన్నారం, జూలై 3: జిన్నారం మండలంలోని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను బుధవారం సన్మానించారు. మండలంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఎంపీటీసీలతోపాటు ఇటీవల పదవీ కాలం ముగిసిన సర్పంచ్‌లు పాల్గొన్నారు. కార్యక్రమానికి జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, బీఆర్ఎస్ నాయకుడు వెంకటేశంగౌడ్ హాజరయ్యారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

కోహీర్, జూలై 3: సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని ఎస్సై కృష్ణయ్య సూచించారు. బుధవారం మండలంలోని బిలాల్‌పూర్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ కొత్త వ్యక్తులకు పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు చెప్పకూడదని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

న్యాల్‌కల్‌లో..

న్యాల్‌కల్, జూలై 3: సైబర్ నేరాపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని హద్నూర్ ఎస్ఐ రామానాయుడు అన్నారు. మండలంలోని హద్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో ప్రిన్సిపల్ అశోక్, అధ్యాపకులు అర్జున్, యాదగిరి, జగదీశ్వర్, శ్రీనివాస్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఐదేండ్లు అంకితభావంతో పనిచేశాం

గుమ్మడిదల, జూలై 3: ఐదేండ్లపాటు అంకితభావంతో పని చేశామని, తమ జీవితం ప్రజా సేవకే అంకితమని ఎంపీపీ సద్ది ప్రవీణా విజయభాస్కర్‌రెడ్డి, జడ్పీటీసీ కుమార్‌గౌడ్ అన్నారు. నూతనంగా అందుబాటులోకి వచ్చిన గుమ్మడిదల మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఐదేండ్లపాటు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. రూ.9 లక్షలతో ఆధునీకరించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఐదేండ్ల పదవీ కాలం పూర్తి కావడంతో ఎంపీపీ, జడ్పీటీసీ, వైస్‌ఎంపీపీ మంజుల, ఎంపీటీసీలను ఎంపీడీవో ఉమాదేవి, ఎంపీవో దయాకర్‌రావు, అధికారులు ఘనంగా శాలువా, జ్ఞాపిక, పూలదండలతో సన్మానించారు. మాజీ సర్పంచ్‌లను, జీపీ కార్యదర్శులను, అధికారులను సన్మానించారు. అనంతరం మొక్కలు నాటి నీరు పోశారు.

గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీపీ సద్ది ప్రవీణ, జడ్పీటీసీ కుమార్‌గౌడ్, తదితరులు

సేవలే చిరస్థాయిగా గుర్తుంటాయి



ఎంపీటీసీలతో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

హత్నూర, జూలై 3: ప్రజాప్రతినిధులుగా ప్రజలకు చేసిన సేవలే చిరస్థాయిగా గుర్తుండిపోతాయని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం హత్నూరలో ఎంపీటీసీల ఆత్మీయ వీడ్కోలు సమావేశాన్ని ఎంపీపీ వావిలాల నర్సింహులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ఎంపీటీసీలు గ్రామాల అభివృద్ధి, ప్రజాసంక్షేమానికి చేసిన సేవలు మరువలేనివన్నారు. పదవి లేకున్నా ప్రజాసేవలో ఎప్పుడూ ముందుండాలని కోరారు. అనంతరం ఎంపీపీ వావిలాల నర్సింహులు, వైస్ ఎంపీపీ లక్ష్మీరవికుమార్, జడ్పీటీసీ అంజనేయులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లను శాలువా, మెమొంటోలతో సన్మానించారు. వీడ్కోలు సమావేశం ప్రారంభమైన కొద్దిసేపటికి కరెంటు సరఫరా నిలిచిపోయి ముగింపు సమయంలో రావడంతో సుమారు రెండు గంటలపాటు ప్రజాప్రతినిధులు, అధికారులు ఉక్కపోత నడుమ సమావేశంలో కూర్చోవాల్సి వచ్చింది. కార్యక్రమంలో రాష్ట్ర లేబర్‌వెల్ఫేర్ బోర్డు మాజీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, నాయకులు దామోదర్‌రెడ్డి, ఎంపీడీవో శంకర్, ఏపీవో ప్రవీన్, ఏపీఎం దేవేందర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

రాయసముద్రం చెరువును పరిశీలిస్తున్న జెడ్పీ ఉపేందర్‌రెడ్డి, కార్పొరేటర్ పుష్పానగేశ్

రామచంద్రాపురం, జూలై 3: భారతీనగర్, ఆర్సీపురం డివిజన్ల కార్పొరేటర్లు సింధూఆదర్శ్‌రెడ్డి, పుష్పానగేశ్‌ల విజ్ఞప్తి మేరకు జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి బుధవారం రెండు డివిజన్‌ల్లో పర్యటించారు. భారతీనగర్ డివిజన్‌లోని బొంబాయికాలనీలో నిర్మాణ దశలో ఉన్న మోడల్ రైతుబజార్‌ని పరిశీలించారు. ఆర్సీపురం డివిజన్‌లోని రాయసముద్రం చెరువుని పరిశీలించారు. చెరువు అభివృద్ధికి కృషి చేయాలని కార్పొరేటర్ పుష్పానగేశ్ జెడ్సీని కోరారు. అనంతరం ఓల్డ్ ఆర్సీపురంలో మీట్ మార్కెట్ నిర్మాణానికి స్థల పరిశీలన, ఆర్సీపురం గ్రంథాలయం నుంచి ఈఎస్ఐ రోడ్డు వరకు రోడ్డు విస్తరణ, హిందూ శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలని కోరారు. కార్పొరేటర్లు జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చిన సమస్యలపై ఆయన సానుకూలంగా స్పందించారు. త్వరలోనే తమ దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

గీతం అధ్యాపకురాలికి సీఎస్ఐఆర్ పరిశోధనా ప్రాజెక్టు

డాక్టర్ గౌసియా బేగం

పటాన్‌చెరు, జూలై 3: గీతం అధ్యాపకురాలికి సీఎస్ఐఆర్ పరిశోధన ప్రాజెక్టు దక్కింది. బుధవారం హైదరాబాద్ గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ గౌసియా బేగంకు ది కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్) ప్రతిష్టాత్మక పరిశోధన ప్రాజెక్టును మంజూరు చేసినట్టు ఆ సంస్థ బుధవారం ప్రకటనలో వివరించింది. కాస్కేడ్ ఉత్ప్రేరకం ద్వారా కోఎంజైమ్ పునరుత్పత్తితో సమన్వయ ఫొటో–బయోక్యాటలిటిక్ హైడ్రోజన్ ఉత్పత్తి పేరిట చేపడుతున్న ఈ పరిశోధన ప్రాజెక్టు 36 నెలల వ్యవధిలో పూర్తి చేయాలని సీఎస్ఐఆర్ వర్గాలు ఆదేశించాయి. యాస్సెర్ పథకం ద్వారా ఈ పరిశోధనకు రూ.25.42లక్షల గ్రాంటును మంజూరు చేశారని, డాక్టర్ గౌసియా బేగం ఈ ప్రాజెక్టుకు ప్రధాన పరిశోధకురాలిగా వ్యవహరిస్తారన్నారు. ఎమ్మెస్సీ (కెమిస్ట్రీ)తో పాటు లెక్చర్‌షిప్ (నెట్) లేదా గేట్ అర్హత సాధించిన వారు ఈ ప్రాజెక్టులో జూనియర్ రీసెర్చ్ ఫెలో (జేఆర్ఎఫ్)గా పనిచేయవచ్చని, వారికి నెలకు రూ.37 వేల స్టైఫండ్ లభిస్తుందని గీతం సంస్థ తెలిపింది. ఆసక్తిగల అభ్యర్థులు మరింత సమాచారం కోసం డాక్టర్ గౌసియాను ఫోన్ నెంబర్ 70933 41504లో సంప్రదించాలని సూచించారు. లేదా qbegum@gitam.edu కు ఈమెయిల్ చేయాలని కోరారు. సీఎస్ఐఆర్ నుంచి పరిశోధనా ప్రాజెక్టు పొందిన డాక్టర్ గౌసియా బేగంను అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీఎస్‌రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, సైన్స్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, డాక్టర్ ఎం రెజా అభినందించారు.

విద్యుత్ షాక్‌తో లైన్‌మెన్ మృతి



చంద్రశేఖర్(ఫైల్)

అందోల్, జూలై 3: ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ సరఫరా కావడంతో లైన్‌మెన్ మృతి చెందిన ఘటన మండల పరిధిలోని ఎర్రారం గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. పుల్కల్ మండలం పెద్దారెడ్డిపేట్ గ్రామానికి చెందిన చంద్రశేఖర్(30) నేరడిగుంట సబ్‌స్టేషన్ పరిధిలో లైన్‌మెన్‌గా పని చేస్తున్నాడు. ఎర్రారం శివారులోని ట్రాన్స్‌ఫార్మర్‌లో సాంకేతిక లోపం ఏర్పడడంతో మరో వ్యక్తి మాణిక్యంతో కలిసి మరమ్మతులు చేస్తున్నారు. ఇంతలో ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ సరఫరా కావడంతో చంద్రశేఖర్ ఘటనా స్థలంలోనే మృతి చెందగా.. మాణిక్యంకు గాయాలయ్యాయి. మృతదేహాన్ని జోగిపేట ప్రభుత్వ దవాఖానాకు తరలించారు. గాయపడిన వ్యక్తిని చికిత్స కోసం సంగారెడ్డికి తరలించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పి గాయపడిన వ్యక్తితో మాట్లాడి మెరుగైన వైద్యం తీసుకోవాలని సూచించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ రవీందర్‌గౌడ్

జిన్నారం, జూలై 3: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని ఎంపీపీ రవీందర్‌గౌడ్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో రూ.30లక్షల అభివృద్ధి పనులకు బుధవారం ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎంపీపీని ఆయా గ్రామాల నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అరుణ, వైస్ ఎంపీపీ గంగు రమేశ్, కోఆప్షన్ సభ్యుడు ఇంతియాజ్, ఎంపీటీసీలు జనాబాయి, సంతోషామహేశ్, లావణ్యనరేశ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వడ్డెకృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు రాజుగౌడ్, బత్తుల మహేశ్, ఆది మల్లేశ్, రవీందర్, నరేందర్ పాల్గొన్నారు.

టీఎన్‌జీవోతోనే సమస్యలు పరిష్కారం

సంగారెడ్డి కలెక్టరేట్, జూలై 3: ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు టీఎన్‌జీవో ఎల్లప్పుడూ ముందుంటుందని టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు ఎండీ జావేద్ అలీ పేర్కొన్నారు. తెలంగాణ అగ్రికల్చర్ మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్(టాస్మా) ఉమ్మడి మెదక్ జిల్లా కార్యవర్గ సమావేశం బుధవారం సంగారెడ్డిలో జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన జావేద్ అలీ మాట్లాడుతూ ఉద్యోగులకు ఎలాంటి సమస్య తలెత్తినా టీఎన్‌జీవో పరిష్కారం చూపుతుందని తెలిపారు. కార్యక్రమంలో టాస్మా మాజీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీహరి, జిల్లా అధ్యక్షుడు కృష్ణారావు, జిల్లా కార్యదర్శి ఎ మల్లేశం, అసోసియేట్ అధ్యక్షుడు సురేశ్, కోశాధికారి నగేశ్, రవి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను నియమించాలి

నాగులదేవులపల్లి పాఠశాలలో ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు

హత్నూర, జూలై 3: హత్నూర మండలం నాగులదేవులపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలకు ఉపాధ్యాయులను నియమించాలని కోరుతూ విద్యార్థులు, తల్లిదండ్రులు గురువారం పాఠశాల ఆవరణలో ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో ఎనిమిది తరగ